# ప్రియమైన నాన్నగారికి...

డా॥ పి.కె. జయలక్ష్మి

ప్రియమైన నాన్నగారికి అనిరుధ్ నమస్కరించి వ్రాయునది. మీరు ఎంతో ప్రేమతో నా పుట్టిన రోజుకుపంపించిన గ్రీటింగ్ కార్డ్ అందింది. ఈ అరవైఐదు సంవత్సరాల వయసులో కూడా మీ దస్తూరి ముత్యాలని మురిపిస్తోంది అచ్చం మునుపటిలానే!

మీరు వ్రాసే ఉత్తరాలన్నింటిని ఎంతో అపురూపంగా భద్రపరచుకుంటూ ఉంటాను. మీరు అందించిన వార సత్వ సంపదకి మచ్చుతునకలు ఆ ఉత్తరాలు. ఈ ఉరు కుల పరుగుల పోటీ ప్రపంచంలో ఒంటరిగా ఫీలయినపుడు, ఎక్కడ ఓడిపోతానో అని భయపడినపుడు మీరు వ్రాసిన ఉత్తరాలు చదువుకుంటుంటే వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లుంది. నిజం నాకెంతో ధైర్యంగా అనిపి స్తుంది.

నాన్నగారూ! నాకు నిన్నటితో నలభైరెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఎందుకో ఒక్కసారి వెనక్కి తిరిగి బాల్యంలోకి తొంగి చూసుకోవాలన్పిస్తోంది. మీకు ఎన్నో చెప్పాలని ఉంది. మీతో ఎన్నో అనుభూతులని పంచుకోవాలని మరీ మరీ అనిపిస్తోంది.నాకు మీలాంటి తండ్రి లభించి నందుకు నేను ఎప్పుడూ ఎంతో గర్విస్తూ వుంటాను నాన్నా!

బాల్యంలో నా ఎదుగుదలకి మంచి పునాది వేశారు మీరు. పెద్దయ్యాక ఇతరుల కళ్ళతో కాకుండా నా కళ్ళతో నేను కలలు కనేలా నన్ను ప్రోత్సహించారు. నన్ను నేను తెలుసుకునేలా నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. నా లక్ష్యాన్ని చేరుకునేలా నన్ను ఉత్సాహపరిచారు. ప్రతి ఉదయం నేను చిరునవ్వు చిందించేలా చక్కని వాతా వరణాన్ని కల్పించారు. నా ప్రతి సాయంత్రాన్ని ఉల్లా సంగా మలిచారు.

ఏ రకమైన ఆంక్షలు పెట్టకుండా, నా నిర్ణయాలమీద నమ్మకం ఉంచి, నా అంతరాత్మని నేను అనుసరించేలా స్వేచ్ఛగా పెరగనిచ్చారు. ఎన్ని కష్టాలు, ఒడిదుడుకులు ఉన్నప్పటికీ మనం జీవించడానికి అత్యద్భుతమైన ప్రదేశం మన కుటంబమే అని తెలియచెప్పారు.

నా బాల్యం ఎంత రమ్యంగా, రసవత్తరంగా గడిచిందో మీకు ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేకపోయినా నాకు మళ్ళీ మళ్ళీ తలపోయడం ఎంతో ఆనందాన్ని స్తుంది. నాకు ఆ రోజులన్నీ ఎదురుగా కళ్ళకి కట్టినట్లుగా కనిపిస్తున్నాయి. సెలవురోజుల్లో సాయంత్రాలు బీచ్‌కు తీసుకువెళ్ళి నేను గాలిపటం ఎగరవేస్తూ ఇసుక గూళ్ళు కడుతూవుంటే ముంతకింద పప్పు, కోన్ ఐస్‌క్రీం తిని పిస్తూ మీరూ, అమ్మ ఎంత మురిసిపోతూ ఉండేవారని?

రోజూ హోంవర్కుతోపాటు, జరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన విషయాలు ఎలా మనసుకు హత్తుకునేలా నూరిపోసే వారో? వారం వారం క్రమం తప్పకుండా సాయిబాబా, కృష్ణుడి మందిరాలకు తీసుకువెళ్ళి క్రమశిక్షణ జీవితంలో అలవాడలంటే దైవభక్తే శరణ్యమని చేతలతో నిరూపిం చారు. అప్పుడప్పుడు జూ పార్కు సందర్శనం, కుందే ళ్ళని, పక్షులని ఇతర జంతువులని చూస్తూ కేరింతలు కొట్టే నన్ను చూసి మీరు ఎలా మైమర్చిపోయేవారో కదా!

సీతాకోకచిలుకల వెంట పరుగులు తీయడం పావురాలకి మేతవేయడం, ఇంద్రధనస్సులో రంగుల్ని చూసి పులకించిపోవడం, ఇంటి పెరట్లో గులాబీలు విరగబూస్తే పరవశించిపోవడం!

మల్లెపందిరి దగ్గర మంచమ్మీద మీ పక్కన పడుకొని ఆకాశంలో నక్షత్రాలని అబ్బురంగా చూస్తూ ఎన్నెన్ని కథలు ఆశ్చర్యంగా విన్నానో, అవన్నీ ఎలా మర్చిపోగలను? ఒకసారి బ్యాంక్‌లో కేషియర్ పొర పాటుగా నాకు వెయ్యి రూపాయిలు అదనంగా ఇస్తే మీరు నన్ను వెంట బెట్టుకు వెళ్ళి తిరిగి ఆ సొమ్ము కేషి యర్‌కి ఇప్పించేసి, 'అలా చేయడం మూర్ఖత్వం కాదు, మన వ్యక్తిత్వాన్ని పతనం చేసుకోకుండా హుందాగా నిలబెట్టుకోవడం అని ఎంత బాగా హత్తుకునేలా చెప్పారు నాన్నా.

అంతేనా! వేసవి సెలవుల్లో తాతగారి పల్లెటూర్లో

ఎంత స్వేచ్ఛగా, హాయిగా గడిపానో ఎప్పటికీ మర్చిపోలేను. అక్కడి పంట పొలాలు, పిల్ల కాలువలో ఈతలు కొట్టడం, జామ, మామిడి చెట్లెక్కి వాటి పళ్ళు తినడం, అక్కడి మనుషుల ఆత్మీయతానురాగాల పలకరింపులు, వేణుగోపాలస్వామి గుడిలో బావి దగ్గర స్నానాలు, ఆ ముంగిట్లోని పారిజాతం పూలతో స్వామిని సేవించడం అబ్బ ఎంత, అపురూపమైన ఆహ్లాదకరమైన అనుభూతులు, నిజంగా అదొక స్వర్ణయుగం కదా నాన్నగారూ. నా ప్రతి అనుభూతిలో మీరూ భాగస్వాములే!

ఇక చదువు విషయం సరేసరి! ఎన్నో విషయాలు ఎంతో విపులంగా వివరించేవారు. ఏ ట్యూషన్స్ అవసరం లేకుండా మీ సాన్నిధ్యంలో ఎంతో నేర్చుకున్నాను. నాన్నగారూ! మీ మనవడు పెద్దవాడవుతున్నాడు. మీ ఇమెయిల్ ఎకౌంట్ అడుగుతున్నాడు. వాడు వాళ్ళ తాతగారితో ఇంటర్నెట్‌లో చాట్ చేస్తాడట. తాతారి దగ్గర కంప్యూటర్ లేదని చెప్పేసరికి వాడు చాలా నిరాశపడి పోయాడు పాపం!

నేను మీ నుంచి పొందిన చిన్నచిన్న ఆనందాలు, సరదాలు నా కొడుకుకి కూడా పంచాలనుకుంటున్నాను నాన్నా. వాడిప్పుడు పదమూడేళ్ళవాడయ్యాడు. కాని ఇంతవరకు గాలిపటం ఎగురవేయలేదంటే నమ్ముతారా? గోళీలు, గోడుంబిళ్ళ ఇవేం ఆడలేదు తెలుసా?

## మధురక్షణాలు...!!

జడివాన దండిగా కురిసిన వేళ
చిరుజల్లులతో పరవశించిన వేళ...!
మంచుబిందువులు మదిని దోచినవేళ
కోకిలమ్మ కమ్మగా కూసినవేళ...!
పల్లెపడుచులు జానపదాలు పాడుతూ
రైతన్నలు నాగలిని భుజాన మోసుకుంటూ
ఎడ్లబండిని తోలుకుంటూ పోతోంటే...!
పచ్చని వరిపైరులు కనువిందు చేస్తున్నాయి...
ఆటపాటలతో చిన్నారులు గంతులేస్తోంటే
చదువుకునే బాలలు బడిబాట పడుతున్నారు...!
పల్లెసీమలు ప్రకృతి అందాలతో విరాజిల్లుతోంటే
అందాల భామలు వయ్యారాలు ఒలకపోస్తోంటే
నిండైన పండు వెన్నెల నింగిలో ప్రకాశిస్తోంది...!
విరబూసిన సన్నజాజులు పరిమళిస్తోంటే
అణువు అణువునా తనువు పులకరిస్తోంది...!
అందాల కొలనులో తామరలు వికసించినవేళ...
పుడమితల్లి తన ఒడిలో తనయుడిని లాలిస్తోంది...!!
అంబరాన సంబరంగా విహరిస్తున్న విహంగాలు..
అడవిలో వన్యమృగాలు వేటగాడి తూటాలను
తప్పించుకుని పరుగులు తీస్తున్న తరుణంలో...
ఘల్లుఘల్లుమని గజ్జెల రవళి శ్రావ్యంగా వినిపిస్తోంటే
నందన వనంలో నాట్యమయూరి నర్తిస్తోంది...!
సంగీత, సాహిత్య సదస్సులు వేదికలను అలరించినవేళ...
రసజ్ఞుల హర్షధ్వానాల నడుమ పతకాలు పంచినవేళ
ప్రముఖుల ప్రశంసలు, వేదాశీర్వచనాల నడుమ
బహుమతి గ్రహీతల కృతజ్ఞతలు ప్రతిధ్వనిస్తున్నాయి...!
ప్రేక్షకుల అంతరంగాలు తన్మయత్వంలో తరించిన వేళ...
తెలుగు వెలుగులు విరజిమ్ముతున్న 'మధుర క్షణాలు'...!
మన సంస్కృతీసంప్రదాయాలకు అవినిర్వచనాలు..
ఆంధ్రుల ఔన్నత్యాన్ని వివరించే చరిత్ర గణాంకాలు..
అవి వన్నెతరగని తెలుగు తల్లికి సమర్పించే నీరాజనాలు...!!

తంగెళ్ళ పాండురంగశర్మ

## నువ్వూ-నేనూ-సౌరకుటుంబం

సూర్యుని చుట్టూ తిరిగే భూగోళంలా
నా ఆలోచనలన్నీ నీ చుట్టూ
సూర్యుని చుట్టూ తిరిగే ఇతర గ్రహాల్లా
నీ ఆలోచనలు అందరి చుట్టూ
అనుకుంటాను నేను నీ మనసుకు సంబంధించి
నేనే గొప్పగా వుండాలని
అన్ని గ్రహాలకంటే భూమికి మహోన్నత
స్థానమున్నట్లు
సౌరకుటుంబంలో ఇతర గ్రహాలూ
వుంటాయంటావు నువ్వు-
సూర్యచంద్రులకు గ్రహణం పట్టినట్లుగా
వస్తుంటాయి
నీకూ నాకూ మధ్య అపోహలు, అపార్థాలూ,
పట్టింపులూ
వివరణలు తెలియకుండానే కాలం వాటిని
చెరిపేస్తుంది
గ్రహణం విడిచినట్లుగా
అయితే అప్పుడప్పుడూ అధికమౌతాయి
ఓజోన్ పొర దెబ్బతిన్నందువల కలిగే
ఇబ్బందుల్లా
ఒక్కొక్కపుడు మైమరపిస్తావు
శిశిరంలో వెచ్చని కిరణాల స్పర్శలోని
పరవశంలా
మరొక్కపుడు ముల్లులా గుచ్చుతావు
గ్రీష్మంలో భూమిని తాకే తీవ్రమైన బలమైన
కిరణాల్లా
కాలచక్రం గతిలో రాత్రి, పగలు, ఋతువులు
మారుతున్నట్లుగా
ఇలాగే సాగుతుందేమో జీవితం
సూర్యుని ప్రేమ లేకపోతే భూమికి ఉనికి లేదని
భూమి లేకపోతే సూర్యుని గొప్పతనం
తెలియదని
ఒప్పుకోక తప్పని వాస్తవం
నువ్వూ నేనూ నాణేనికి ఇరువైపులా అని
ఒకరికొకరుగా వుండటం తప్పదనేది నేటి
సత్యం

యజ్ఞశ్రీ

జామచెట్టుగాని, మామిడి చెట్టుగాని ఎక్కలేదు. వాడు ఈ అనుభవాలన్నీ చవి చూడాలని నా కోరిక.

వాడి బాల్యం అసంతృప్తిగా, అసంపూర్తిగా ఉండ కూడదు నాన్నా! కాని ఏం చేయను? వాడు కొత్త 'తరం' కొడుకు. తెలుగులో 'అంకెలు' 'డిఫికల్ట్‌గా' అన్పిస్తాయి వాడికి. ఈ కాన్వెంట్ కల్చర్ తెలుగు భాష మాధుర్యాన్ని పూర్తిగా మర్చిపోయేలా చేయడంలో కృతకృత్యురా లయింది. చిన్నపుడు సుమతీ శతకం, వేమన పద్యాలు మీరు ఎంతో శ్రావ్యంగా పాడి ఎంతో చక్కగా నాతో వల్లెవేయించేవారు కదా నాన్నా! అవేవీ రాజాకు తెలియవు.

వాడికి కంప్యూటర్ గేమ్స్ అంటే ప్రాణం. కేబుల్, టి.వి కార్టూన్ నెట్ వర్క్, క్రికెట్, ఫ్రెండ్స్ ఇవి వుంటే చాలు. సెల్‌ఫోన్లో గంటల కొద్ది ఫ్రెండ్స్‌తో మాట్లాడ్డం మరీ మరీ ఇష్టం. వాడికి మాక్‌డోనాల్డ్, పిజ్జాహట్‌లో బర్గర్స్, చిప్స్, కాప్సికమ్ పిజ్జా మహా ఇష్టం. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ హై సొసైటీ కల్చర్‌లో వాడు తన బాల్యాన్ని, నైతిక విలువల్ని కోల్పోతున్నాడేమో అని నాకు అప్పుడప్పుడు అనిపిస్తోంది.

దాదాపు ఆరు, ఏడు సంవత్సరాలు చదువని, రీసెర్చ్ అని అమెరికాలో గడిపి నేనీ రోజు బొంబే మహానగరంలో ఒక ప్రతిష్ఠాత్మకమైన సంస్థలో ఉన్నతమైన పదవిలో ఉన్నానంటే దానికి ప్రేరణ, ప్రోత్సాహం అంతా మీరే కదా

## సుసంస్కృతి

నూతన వత్సరాన్ని
స్వాగతించటం
సాంప్రదాయబద్ధమే!
'ప్రకృతి'నంతటిని
'వికృత'రూపంచేస్తూ
వేయి ప్రక్కల
గొడ్డలి పెట్లకు
గురిచేస్తున్న ఈ తరుణంలో
'వికృతి'నే ఆపాదించుకొని
వస్తున్న 'ఓ కొత్త సంవత్సరమా!'
చిత్తెములన్ని - బహు క్షోభితములై
విలపించుచున్నది-ఏనాడో
జన వికృత చేష్టలకు ఉడిగి!
ధన,మాన, ప్రాణాలకు
దుర్గతిపట్టి, దిగంతాల
ఆనలకి-దొర్లినాయి!
భ్రూణహత్యలు, మానభంగాలుతో
భూమాత హృదయం బీటలు వారిన
బీడు-భూమయ్యింది ఏనాడో!
ఇక ఏడాది పొడుగూత-ఎలా గడవాలి?
వేడుకొనేను-ఓ, వి...కృతీ!
చేయకూడనివన్ని చాటి చెప్తూ
ప్రజాసంక్షేమము - కాంక్షించి
ఆగమించు-సుసంకృతి, సంతరించుకొని

శ్రీమాన్ శ్రీకాశ్యప

నాన్నా. బాల్యంలో మీరు నాలో నింపిన ఆత్మవిశ్వాసం, పనిపట్ల అంకితావం, జీవితంపట్ల సానుకూల దృక్పథం, ఆశావహ దృష్టికోణం ఇవన్నీ నేనీ స్థాయికి చేరుకోవడానికి దోహదపడ్డాయి.

మనకంటే ఆర్థికంగా తక్కువ స్థాయిలో ఉన్న రామం, శివా ఎంత కష్టపడి పట్టుదలతో కఠోర పరిశ్రమతో ఐఐటి సాధించారో నాకింకా గుర్తే! అన్ని సౌకర్యాలు, వసతులు ఉన్న నేటి తరం పిల్లలు ఇంకా ఏవో కంఫర్ట్స్ లేవని గొణుక్కుంటూ సమయాన్ని టీ.వీ, కంప్యూటర్సు, ఫ్రెండ్స్, ఫోన్లు, క్రికెట్‌తో దుర్వినియోగం చేసుకుంటూ చదువులో వెనకబడిపోతుంటే కనీసం అవసరాలు కూడా తీర్చే స్థోమత లేని బీద తల్లిదండ్రుల పిల్లలు ఎంత బాగా చదువుకొని వృద్ధిలోకి వస్తున్నారో నాకెంత చక్కగా వివరించేవారు నాన్నా!

మన దూరపు చుట్టాలబ్బాయి నెలరోజులపాటు ఎంసెట్ కోచింగ్‌కి పల్లెటూరు నుంచి మన ఇంటికి వచ్చి ఎంత చక్కగా తపస్సులాగా చదువుకొని మంచి ర్యాంక్ సాధించాడో ఇవాళ్టికీ నేను మర్చిపోలేను. మీరెపుడూ అనేవారు కదా కడుపునిండిన వాడికి ఆకలి విలువ తెలియదు. ఖాళీ కడుపుతో ఉంటే గంజే పరమాన్నంలా అన్పించి ఆవురావురుమని తింటారు! అని.

అలాగే ఏ కనీస వసతులు కూడా లేని పల్లెటూరి వాడికి నగరాల్లో ఏ.సి కార్లలో తిరుగుతూ, పెద్ద పెద్ద భవనాల్లో నివసించే వారంటే ఏదో తెలియని ఆకర్షణ. తామూ అలాగే ఏదో ఒకరోజు అయి తీరాలనే మొండి పట్టుదలతో, తమ కలల్ని సాకారం చేసుకోడానికి అహోరాత్రులు అకుంఠిత దీక్షతో లక్ష్యాన్ని సాధించి తీరతారు.

కాని నగరాల్లో అన్ని కంఫర్ట్స్‌కు అలవాటుపడిన పిల్లలు ఇలాంటి వారిని చిన్నచూపు చూడకుండా తామ రాకుమీద నీటిబొట్టులా ఉంటూ కష్టపడి తమ లక్ష్యాన్ని సాధించాలని ఎంత నేర్పుగా చెప్పేవారు నాన్నా మీరు!

మీ కంటే మీ కొడుకు ఉన్నత స్థాయిలో ఉండాలని, చిన్నప్పుడు మీకు లేని సౌకర్యాలు నాకు అమర్చి అలాగే నాకు లేనివి నా కొడుకు పొందాలని కోరుకునే వారు మీరు.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే మీ సిద్ధాంతాన్ని నేను త్రికరణ శుద్ధిగా ఆచరిస్తున్నాను. పెద్దవారి పట్ల గౌరవం, చిన్నవారితో సఖ్యతగా ఉండడం, ఇతరులతో షేర్ చేసుకోవడం అందరితో మన్ననగా మసలుకోవడం అన్నీ మీరు నాకు ఎంత ఓపిగ్గా నేర్పించారు నాన్నా.

ఒక్కడినే సంతానం కావడంతో ఎక్కడ మొండిగా, అహంకారంగా తయారవుతానోనని చాలా జాగ్రత్తలు తీసుకుని నన్ను పెంచి పెద్ద చేశారు. ఎప్పుడూ నేను ఎవ రితో వేలెత్తి చూపించుకోలేదు. ఎప్పటికీ నా బాల్యాన్ని మర్చిపోలేను.

కానీ ఒక్కొక్కసారి రాజాను చూస్తుంటే ఒక తండ్రిగా నేను సక్సెస్ కాలేకపోతున్నానేమోనని బెంగగా అనిపి స్తుంది. ఎందుకంటే ఈ మహానగర వాతా వరణ ప్రభా వమో, స్నేహితుల సమ్మోహమో కాని రాజాలో అహం కారం ఛాయలు కొద్ది కొద్దిగా కనిపిస్తు న్నాయి.

ఇప్పుడిప్పుడే టీనేజ్‌లోకి అడుగుపెడుతున్న రాజాకి బీదరికం శాపం కాదని తెలియాలి. తనకంటే తక్కువ స్థాయి వారిపట్ల కరుణ, జాలి చూపడం వాడు నేర్చుకో వాలి. ఎప్పటికప్పుడు రాజాని దగ్గర కూర్చోబెట్టుకొని ఇవన్నీ చెప్పాలనుకుంటాను.

కానీ వాడికెప్పుడూ హోంవర్కు, ట్యూషన్సు కాస్త టైము దొరికితే క్రికెట్, ఫ్రెండ్స్ నాకూ మీ కోడలికి ఉద్యోగ బాధ్యతలతో తీరిక లేని ఈజీవితం ఈ కంప్యూటర్ యుగంలో స్పీడ్ పెరిగిపోయి, కుటుంబ సభ్యులంతా కలిసి మనసారా మాట్లాడుకోడానికి, కడుపారా కలిసి తినడానికి తీరిక దొరకడం లేదంటే నమ్మండి. అందుకే మీ సాంగత్యంలో, సంరక్షణలో రాజాని ఉంచాలనుకుం టున్నాను.

మొక్కై వంగనిది మానై వంగునా అన్నట్లు ఈ కౌమారదశలో సక్రమంగా తీర్చి దిద్దకపోతే వాడి భవి ష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం ఖాయం.

మీరంటే వాడికి చాలా ప్రేమ, గౌరవం. మీ మాటంటే ఎంతో గురి. అందుకే జీవితాన్ని చదవడం వాటికి ఇప్పటి నుంచే నేర్పించాలి.

కష్టపడి సాధించినవిజయంలో ఎంత సంతృప్తి ఉం టుందో వాడికి తెలియచెప్పాలి. ఇతరుల సాఫల్యాలకి

## నిజరూపం

విస్తరించని మనస్సుకు
వస్తువు నవ్యమైనా ఏంలాభం?
ఉదయించని నిశీధికి
ఉజ్జ్వలరాగాలు రుచిస్తాయా?
సంకుచితమైన భావం
స్వారస్యం లేని జీవం
కఠినపాషాణం కాదా?
కఠోరనిజం ఇందులో లేదా?
భావం చిన్నదే అయినా
అనుభూతి ఘనంగా ఉండాలి
అలరించే సుగుణంతో పండాలి
అప్పుడే కదా అణువైనా
అఖిల బ్రహ్మాండంతో సమానం!
అనిర్వచనీయానందానికి తులామానం!!

డా॥ అయాచితం నటేశ్వరశర్మ

## మగాడు

చనువిస్తే
ప్రేమించమంటాడు
తనువిస్తే
పెండ్లాడనంటాడు

## మందు

త్రాగితే
షేప్
మానితే
సేవ్

## భక్తి

కోరికలు
భారం
కొబ్బరికాయకు
బేరం

దేవయజనం కృష్ణమాచార్యులు

## మన జా'తీయ' రహదారులు

మన భారతదేశంలో... మందిరాలకు,
గురుద్వారాలకు, మసీదులకు, చర్చీలకు...
జనం వెళ్ళేదారులన్నీ...
భార'తీయ' జా'తీయ' రహదారులే!

## ఎందుకని...?

నేటి సినిమాల్లో హీరోలకు మాత్రం
భారీ రెమ్యునరేషన్లు, వారికి ఖరీదైన సూట్లు - బూట్లు
భారీ సెట్టింగుల ఖర్చులు - కోటానుకోట్లు
పెద్ద పెద్ద మొత్తాలు చెల్లించే గొప్ప గొప్ప దర్శకులు
టెక్నీషియన్లు - విదేశీ లొకేన్లు
పాపం... హీరోయిన్లు
వీరి దుస్తుల విషయంలో మాత్రం
నిర్మాత అవుతుంటాడు మరీ...'పిసి'నారి'
ఎందుకని...?

## మనవాడే

ఐదేళ్ళకొక్కసారే చూస్తాడు మనకేసి
పిదప తిరుగుతుంటాడు మొఖం చాటేసి
ఎంత మొత్తుకున్నా... తిట్టుకున్నా ఊరుకుంటాడు
వినేసి
సమాధానాలు చెపుతుంటాడు ప్రశ్నలు దాటేసి
తరతరాలకు సరిపడా అక్రమంగా వుంచుతాడు
వెనకేసి
అతడు(?) దోచుకునే డబ్బు ''స్వదేశి''
అతడు దాచుకునే బ్యాంకు ''విదేశి''
జనం జాగ్రత్తగా వుండాలి... ఇటువంటి వారిపై ఓ
''కన్నేసి''!

బి.ఎం.పి.సింగ్

మనస్ఫూర్తిగా అభినందించడం ఎంత గొప్ప విషయమో వాడికి తెలియజేస్తూ చిన్నప్పుడు మన వీధి చివరి పోస్టు మాస్టరుగారి అబ్బాయి మధు కష్టపడి ఐ.ఐ.టి సాధించిన వైనం వివరించాలి.

తమ లక్ష్యసాధనలో కొన్ని త్యాగాలు ఈ వయసులో ఎంత అవసరమో, ఇప్పుడు కష్టపడితే తర్వాత జీవితంలో అంతా సుఖమే అన్న సంగతి వాడి మనసుకి హత్తుకునేలా మీరే చెప్పాలి నాన్నా.

బీదవాళ్ళ పిల్లలే కాదు గొప్పవాళ్ళ పిల్లలు కూడా పట్టుదల, దృఢసంకల్పం ఉంటే లక్ష్యాన్ని సాధించి తీరతారు అన్న విషయాన్ని మీ ఈ ఐఐటి కొడుకు ఉదాహరణతో చెప్తారు కదా! తల్లిదండ్రులబట్టి కాకుండా తనకి తానుగా వాడు గుర్తింపు తెచ్చుకోవాలి.

జీవితానికి సంబంధించిన సున్నితమైన అంశాల్ని మృదువుగానే అయినా ఖచ్చితంగా మనసుకానేలా రాజాకి చెప్తారని ఆశిస్తున్నాను. అందుకే నాన్నగారూ! ఈసారి సెలవులకి నేను మీ మనవణ్ణి మీ దగ్గరకి తీసుకువస్తున్నాను. అసలు నేను మీ కోడలు ఎన్నోసార్లు మా దగ్గరికి వచ్చేయమని అభ్యర్థించాము.

కాని పుట్టి పెరిగిన ఊరు, సహజ సిద్ధమైన ప్రకృతి వనరులు, ఆప్యాయత పంచే స్నేహితులు, ఆత్మీయత కురిపించే ఊరివాళ్ళు - వీరందరిని వదిలి రావ డానికి మీకు మనస్కరించలేదు. అందుకే మేమే మీ దగ్గ రికి వస్తున్నాము.

కొన్నాళ్ళువాడు మన పల్లెటూరి జీవితాన్ని ఎంజాయ్ చేశాక మీరు వాడి భవిష్యత్తు దృష్ట్యా మాతో ముంబాయి వచ్చేయాలని మా అభ్యర్థన. మనమంతా కలసివుంటే వాడు మీ పెంపకంలో, పర్యవేక్షణలో ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకోగలడని మా ప్రగాఢ విశ్వాసం. వాడు మీ మాటలు తప్పక వింటాడనే నా నమ్మకం.

బాల్యం అంటే ఎంత రసవత్తరంగా వుంటుందో, ప్రతి క్షణాన్ని ఎంత చక్కగా ఆస్వాదించవచ్చో, పెద్దవాళ్ళ సాహచర్యం ఎంత ధీమాని, బలాన్ని ఇస్తుందో వాడికి మీరే వివరించాలి. మీరు మాతో వుంటే మాకు ఎంతో తృప్తిగా, నిశ్చింతగా ఉంటుంది.

నాన్నా! ఇదిగో మీ కోడలు భోజనానికి పిలుస్తోంది. ముద్దపప్పు, ముక్కల పులుసు, గుత్తొంకాయ కూర, గోంగూర పచ్చడి మీకు చాలా ఇష్టమైన వంటకాలు కదా ఇవి నాన్నా! త్వరలో మనం కలిసి గడపబోయే శుభ ఘడియలకోసం ఎదురుచూస్తూ.... ■